# జాతీయ, అంతర్జాతీయ పరిస్థితి - మన కర్తవ్యాలు

## సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి ఆమోదించిన రాజకీయ తీర్మానం - 9 సెప్టెంబర్ 2017

## అంతర్జాతీయ పరిస్థితి

వివిధ దేశాలను భిన్న తీవ్రతతో తాకిన ప్రపంచ ఆర్థిక సంక్షోభం, చక్రభ్రమణ స్వభావం కలిగి వుంది. ప్రతిసారీ అది ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలోని సంక్షోభాన్ని తీవ్రం చేస్తూ వస్తున్నది. సామ్రాజ్యవాదానికీ – పీడిత ప్రజలూ దేశాలకూ మధ్యనున్న; పెట్టుబడికీ, శ్రమకూ మధ్యనున్న; వివిధ సామ్రాజ్యవాద శక్తుల మధ్యనున్న వైరుధ్యాలు నానాటికీ తీవ్రమౌతున్నాయి.

2008 నాటి ద్రవ్య సంక్షోభం నుండి ఆర్థిక వ్యవస్థ కోలుకున్నదని సామ్రాజ్యవాదదేశాల నాయకులు చెప్పుకుంటున్నప్పటికీ, అది నేటికీ ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థను వెన్నంటే వుండి వేధిస్తున్నది. సంక్షోభాన్ని అదుపు చేసేందుకు సామ్రాజ్యవాదశక్తులు తీసుకున్నామని చెబుతున్న చర్యలు ద్రవ్య గుత్త పెట్టుబడిదారుల జేబులను నింపగా, ప్రజలను దారిద్ర్యంలోకీ నిరుద్యోగంలోకీ నెట్టివేశాయి.

సామ్రాజ్యవాద దేశాలలోని కార్మికులపై సంక్షోభ భారాన్ని మోపేందుకు తీసుకుంటున్న చర్యలు వివిధ రూపాలలో వుంటున్నాయి. యూరపులో కార్మికుల తొలగింపు, వేతనాల తగ్గింపు, సంక్షేమంలో కోత పెద్ద యెత్తున సాగాయి. వీటితో పాటుగా అమెరికా గుత్తపెట్టుబడిదారులు కార్మికుల ఆరోగ్యరక్షణ, పెన్షన్‌లలో కోత పెట్టారు.

కార్మికులు ఉద్యోగ విరమణ తర్వాత పొందే సౌకర్యాలను 2001 – 2015 మధ్య 25 శాతం తగ్గించారు. దీర్ఘకాలంగా అమలులో వున్న నిర్దిష్ట సౌకర్య ఉద్యోగ విరమణ పథకాన్ని, కొత్తగా పనిలో చేరిన కార్మికులకు వర్తింపచేయకుండా, దాని స్థానంలో కార్మికులు చెల్లించే నిర్దిష్టచందా పథకాన్ని అమలు జరిపారు. నిర్దిష్ట సౌకర్య ఉద్యోగ విరమణ పథకాన్ని యిస్తున్న యజమానులు 2001లో 45 శాతం వుండగా, 2015లో 7 శాతానికి తగ్గి పోయినట్లు ఒక అధ్యయనం తెలిపింది. 65 ఆపై వయసుండి ఇంకా పని చేస్తున్న అమెరికన్లు 2000లో 13 శాతం వుండగా, 2016లో 19 శాతానికి పెరిగారనీ, రాగల ఐదేళ్లలో 32 శాతానికి పెరుగుతారనీ మరొక అధ్యయనం తెలిపింది.

1940లు, 1950లలో కార్మికవర్గ భీకర పోరాటాల ఫలితంగా సాధించుకున్న యాజమాన్యాలు భరించే ఉద్యోగ విరమణ, ఆరోగ్యరక్షణ సౌకర్యాలు 1970ల వరకు కొనసాగాయి. ఇప్పుడు గుత్త పెట్టుబడిదారులు ఈ సౌకర్యాలను తొలగించి వేస్తున్నారు. వారి వికృత వాదనలను డెల్ఫీ కంపెనీ సిఈఓ మాటల్లో చూడండి : "నీవొక యాజమాన్యం క్రింది 65 ఏళ్ళ వయసు వరకూ పనిచేసి, 70 ఏళ్ళకు చనిపోతుంటే, నిర్దిష్ట సౌకర్య పథకాలున్న సామాజిక ఒప్పందానికి ఆర్థికపరంగా అర్థం వుంటుంది. కానీ 20 ఏళ్ళకు పనిలో చేరి 50 ఏళ్ళకు రిటైరయ్యి, 90 ఏళ్ళవరకూ బ్రతుకుతూ పూర్తి పెన్షను, ఆరోగ్య నిధులు పొందాలనటానికి అర్థం లేదు." కార్మికులకు చట్టబద్ధంగా చెల్లించాల్సిన సౌకర్యాలను ఎగనామం పెట్టి లాభాలను పెంచు కునేందుకే గుత్త పెట్టుబడిదారులు నిశ్చయించు కున్నారన్నది స్పష్టమే.

కోలుకోలేని సంక్షోభం, ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి, ఆగ్రహాలతో సామ్రాజ్యవాద దేశాలు పాశవిక నిర్బంధాన్ని అమలు జరుపుతున్నాయి. పౌర, ప్రజాస్వామిక హక్కులపై ఆంక్షలు, క్రమంగా వాటి కుదింపు యీ నిర్బంధంలో భాగమే. టెర్రరిజంపై పోరు పేరిట నిరంకుశాధికారాలు చెలాయించటం సర్వ సాధారణమైంది. పారిస్‌లో టెర్రరిస్టు దాడుల తర్వాత కొనసాగుతున్న అత్యవసర పరిస్థితి, ప్రజాస్వామ్య రక్షణ పేరిట నిరంకుశ పాలన సాగించే ధోరణిని సూచిస్తున్నది. ముస్లిం వ్యతిరేక, వలసదారుల వ్యతిరేక జాతివివక్షతను సామ్రాజ్యవాద దేశాలు రెచ్చగొడుతున్నాయి. ఛార్లెటొ విల్లీలో జాతి వివక్షా హింసాకాండకు అధ్యక్షుడు ట్రంప్ సమర్థన దీనికి ఉదాహరణ. ఆ పట్టణంలో శ్వేతజాతి ఉన్మాదులు హింసాకాండకు దిగి విద్యార్థులను, పౌరులను భీతిల్లజేస్తుంటే పోలీసులు చూస్తూ ఊరకుండి కన్నుగొట్టి ప్రోత్సహించారు. శ్వేతజాతి ఉన్మాదులకు "చాలా మంచివాళ్లు" అని ట్రంప్ కితాబునిచ్చి, దీనినెదిరించినవాళ్లను "హింసాయుత వామ పక్షీయుల"ని ముద్ర వేశాడు. అలాగే యూరపు అంతటా కూడా పాలకవర్గాలు నయా నాజీ శక్తులనూ, సంస్థలనూ ప్రోత్సహించి, శరణార్థులుగా, పనికోసం వస్తున్న వారికి వ్యతిరేకంగా జాతీయోన్మాదాన్ని రెచ్చగొడుతున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో అనివార్యమైన సంక్షోభ ఫలితంగా దిగజారిపోతున్న జీవన పరిస్థితులపై ప్రజల్లో పెల్లుబుకుతున్న ఆగ్రహాన్ని ప్రక్కకు మళ్లించేందుకు పశ్చిమ సామ్రాజ్యవాద దేశాలు యిదే వ్యూహాన్ని అనుసరిస్తున్నాయి. ప్రథమం అమెరికా ఉద్యోగాలు అమెరికన్లకే వంటి ట్రంప్ నినాదాలు దీనిలో భాగమే.

ట్రంప్‌ను 'దెయ్యం'గానూ, ట్రంప్ విధాన ప్రకటనలన్నీ ఆయన వ్యక్తిత్వ లక్షణాలుగానూ చాలామంది చిత్రిస్తున్నారు. ట్రంప్ ద్రవ్య గుత్త పెట్టుబడి ప్రతినిధి అనీ, అమెరికా రాజకీయ వ్యవస్థలో పెరుగుతున్న ఫాసిస్టు ధోరణుల ఫలమే ట్రంప్ అనీ వారు చూడలేకపోతున్నారు. పెట్టుబడిదారీ విధానపు తీవ్ర సంక్షోభ ఫలితమే ఫాసిజమన్నది సర్వ విదితమే.

నిక్సన్ అధ్యక్ష పాలన ప్రపంచ వ్యాపితంగా అమెరికా సామ్రాజ్యవాదం సాగిస్తున్న నేరపూరిత కార్యకలాపాలను వాటర్‌గేట్ కుంభకోణంగా బయట పెట్టింది. ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా యుద్ధాన్ని కార్టర్ ప్రారంభించాడు. అది తాలిబాన్, అల్‌ఖైదాలను సృష్టించింది.

రీగన్‌పాలన అమెరికాలో సంక్షేమ పథకాలపై దాడి చేసింది. నికరాగువాలో ప్రభుత్వాన్ని కూలద్రోసే యుద్ధం సాగించింది. సీనియరు బుష్ పనామాను దురాక్రమించాడు. ఇరాక్‌పై మొదటి యుద్ధం చేశాడు. క్లింటన్ ఇరాక్‌పై బాంబులు కురిపించి ఆంక్షలు విధించటంతో లక్షలాది పౌరులూ, బాలలూ హతులయ్యారు. సెర్బియాపై యుద్ధం సాగించాడు. జూనియర్ బుష్ ఇరాక్‌పై, లిబియాపై మళ్ళీ యుద్ధం చేశాడు. లక్షలాదిమందిని చంపాడు. ఖైదీలపై చిత్రహింసలను ఒక అణచివేత విధానంగా అమలుజరిపించాడు. ఆశ – మార్పుల అభ్యర్థిగా అధ్యక్షుడైన ఒబామా పైలెట్టు లేని విమాన దాడులతో హత్యలను ఆమోదించాడు; దేశ పౌరులపై గూఢచర్యాన్ని అమలుజరిపాడు. కాగా, వేల కోట్ల డాలర్లతో ద్రవ్య పెట్టుబడి రక్కసుల లాభదాహం తీర్చాడు. ఈ ఫాసిస్టు ధోరణుల కొనసాగింపే ట్రంప్.

ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలపై పట్టును మరింత బలీయం చేసుకునేందుకు సామ్రాజ్యవాదం, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్య వాదం, తన ఆధిపత్యాన్ని స్థిరపరచుకునేందుకు పూనుకుంది. సరుకులు, సేవలు, మేధోపర హక్కులపై ప్రపంచ వాణిజ్యసంస్థ నిర్దేశించిన దానికి మించిన రాయితీలను యివ్వాలని మూడవ ప్రపంచ దేశాలను వత్తిడికి గురిచేసి పొందుతున్నది. మూడవ ప్రపంచ దేశాల సహజ, ద్రవ్య వనరులనూ, మానవ శక్తినీ మరింతగా దోచుకునేందుకు ప్రాంతీయ వాణిజ్య ఒప్పందాలను ప్రతిపాదిస్తున్నది.

దీనికనుగుణంగానే, తమ రాజకీయాధి పత్యాన్ని కొనసాగించేందుకు సామ్రాజ్యవాద శక్తులు సైనిక బలాన్ని వినియోగిస్తున్నారు. వాటి పెరుగుతున్న సైనిక ఖర్చు, సైనిక జోక్యాలూ, దురాక్రమణ బెదిరింపులు దీనినే తెలుపుతున్నాయి.

అమెరికా సామ్రాజ్యవాదం నుండి నిరంతరం దురాక్రమణ బెదిరింపుల నెదుర్కొంటున్న ఉత్తర కొరియా ఖండాంతర క్షిపణినీ, అణుబాంబునూ పరీక్షించింది. ఉత్తరకొరియా ఆత్మరక్షణ చర్యను మానవాళి ఉనికికే ప్రమాదకరమైన రాకాసిగా అమెరికా సామ్రాజ్యవాదం చిత్రిస్తున్నది. భూగోళం మొత్తాన్నీ నాలుగు సార్లు నాశనం చేయగల అణ్వాయుధాల గుట్టలపై కూర్చున్న అమెరికా సామ్రాజ్యవాదం, తన అణు గుత్తాధిపత్యంతో ప్రపంచంపై పెత్తనాన్ని నిలబెట్టుకోవటానికి ఇతర దేశాలను నిరాయుధులను చేయజూస్తున్నది. సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్య వాదుల దాడుల నుండి ఆత్మరక్షణ చేసుకునే, అణ్వాయుధాలతో సహా ఆయుధాలను తయారు చేసుకునే హక్కు ప్రతి దేశానికీ వుంది.

దోపిడీ సొమ్ములో వాటాల కొరకు సామ్రాజ్యవాద శక్తులు పోటీపడుతున్నాయి. సంక్షోభ తీవ్రత కొనసాగుతుండటంతో ఈ కీచులాటలు పెరుగుతున్నాయి. ఇటీవల జర్మనీలో జరిగిన జి–20 శిఖరాగ్ర సదస్సులో ఈ కీచులాటలే ప్రతిధ్వనించాయి. యూరపు దేశాలపై అమెరికా ఆధిపత్యాన్ని పొందేందుకు ప్రతిపాదించిన 'అట్లాంటిక్ సముద్రాంతర వాణిజ్య, పెట్టుబడి భాగస్వామ్యాన్ని' యూరోపియన్ యూనియన్, ప్రత్యేకించి జర్మనీ, ఫ్రాన్సులు తీవ్రంగా వ్యతిరేకించాయి. అలాగే 'పసిఫిక్ తీర భాగస్వామ్య' ప్రతిపాదన కూడా ముందుకు కదలటంలేదు. ఒక సామ్రాజ్యవాదంగా ప్రపంచ వ్యవహారాలలో తన స్థానం కోసం రష్యా ముందుకు వస్తున్నది. సిరియాలో అస్సాద్ ప్రభుత్వాన్ని తొలగించాలన్న అమెరికా పథకానికి రష్యా అడ్డుకట్ట వేసింది. రష్యా చేతులు కలపజూడటం, ఆర్థికశక్తిగా పెరిగిన చైనా, ఆఫ్రికాలోకి పెట్టుబడితో చొరబడటం, తన ప్రయోజనాలకు భంగకరంగా అమెరికా సామ్రాజ్యవాదం చూస్తున్నది. దీనినెదుర్కొనటానికి అమెరికా సామ్రాజ్యవాదం దక్షిణాసియాపై దృష్టి పెట్టింది. హిందూ మహాసముద్రంలోకి రష్యా, చైనాల ప్రవేశానికి అడ్డుపడేందుకు రూపొందించిన తన 'ఆసియా కీలు' విధానంలోకి జపాను, ఆస్ట్రేలియా, భారత్‌లను సమీకరించింది. ఇది సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు పదునెక్కుతున్నాయని తెలుపు తున్నది.

అన్ని దేశాలలోనూ ప్రజలు అసంతృప్తితో, ఆగ్రహాలతో వున్నారు. వారు నిరసన తెలుపు తున్నారు. తమ సమస్యల పరిష్కారానికి దారికోసం చూస్తున్నారు. ప్రపంచమంతటా కార్మికవర్గం ఆర్థిక డిమాండ్ల కోసమే కాకుండా, కొన్ని ప్రజాస్వామిక, రాజకీయ డిమాండ్ల కోసం కూడా పోరాడుతున్నది. ప్రజా ఉద్యమం సామ్రాజ్యవాద వ్యతిరేక రూపం సంతరించుకున్నప్పుడు, స్థానిక అభివృద్ధి నిరోధక శక్తుల సహకారంతో సామ్రాజ్యవాదం తన ప్రయోజనాలను కాపాడుకొనేందుకు ఆ ఉద్యమాలను పక్కదారి పట్టిస్తున్నదని ట్యూనీసియా, ఈజిప్టు పరిణామాలు తెలిపాయి. ప్రజా ఉద్యమ వెల్లువ అలల అగ్రాన నిలచి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు, సామ్రాజ్యవాద ఆజ్ఞలకు భిన్నంగా ప్రజాస్వామిక, జాతీయ విధానాలను అమలు జరిపినప్పుడు, వాటిని కూల్చివేసేందుకు అమెరికా సామ్రాజ్యవాదం అన్నిరకాల ప్రయత్నాలూ చేసింది. ఛావెజ్ మరణం తర్వాత, వెనిజులాలోని జాతీయ బూర్జువావర్గం, అమెరికా సామ్రాజ్యవాదపు వత్తిడికి లొంగిపోయిందని మదురా ప్రభుత్వ విధానాలు తెలుపుతున్నాయి.

ప్రపంచ ప్రజలు నిరాసక్తంగా లేరు. వారు తమ పోరాటాలనూ, నిర్మాణాలను అభివృద్ధిచేసు కుంటున్నారు. సామ్రాజ్యవాదానికీ, దేశీయ పాలక వర్గాలకూ వ్యతిరేకంగా వారు సాగిస్తున్న పోరాటాలను దోపిడీ అణచివేతల నుండి విముక్తి పోరాటాలుగా నడిపించేందుకు వారికి సరైన నాయకత్వం – కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం కావాల్సివుంది.

## జాతీయ పరిస్థితి

బిజెపి నాయకత్వంలో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లయింది. తన నాల్గవ స్వాతంత్ర్యదిన ఉపన్యాసంలో ప్రభుత్వ విజయాలను ప్రధానమంత్రి ఏకరువు పెట్టాడు. ఆకర్షణీయ నినాదాలలో నిపుణుడైన మోడీ 'భారత్ జోడీ' అని మరో నినాద మిచ్చాడు. తర్వాతిరోజున, పార్లమెంటు వర్షాకాల సమావేశం చివరిరోజున, చర్చ జరగకుండా నివారించేందుకు విడుదల చేసిన 2016–17 ఆర్థిక సర్వే రెండవభాగం మోడీ ఉపన్యాసం రేకెత్తించిన ఆశలపై నీళ్లు జల్లింది.

మోడీ పదవీ స్వీకారం నాటికి ఉత్పాదకరంగం కృంగిపోయివుంది. ఈ రంగాన్ని పునరుజ్జీవింప చేయటానికేనంటూ మోడీ "భారత్‌లో తయారీ"ని ప్రకటించాడు. మూడేళ్ళ తర్వాత ఉత్పాదకరంగం తన సామర్థ్యంలో 70శాతం మేరకే పనిచేయగల దుస్థితిలో

వుంది. నోట్ల రద్దు, వస్తు సేవల పన్నుల అమలువల్ల "ఉత్పాదకరంగంలోని 25 ఉప విభాగా లలో 15 ఉపవిభాగాలు కుదించుకుపోయాయ"ని ఆర్థిక సర్వే పేర్కొంది.

ఆర్థిక కార్యకలాపాలకు ముఖ్యసూచికైన ఉద్యోగ కల్పన విషయంలో, 2017 జనవరి-ఏప్రిల్ మధ్య 15 లక్షల ఉద్యోగాలు అదృశ్యమయ్యాయి. ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలిస్తానన్న మాటలను మోడీ వదలిపెట్టి ఉద్యోగాలు కోరే వారిగా కాకుండా ఉద్యోగాలిచ్చేవారిగా మారండని యువతకు పిలుపు నిచ్చాడు. యువతకు స్వయంఉపాధి అవకాశాలు కల్పిస్తానన్న మరో వాగ్దానంతో ఉద్యోగకల్పన బాధ్యత నుండి మోడీ తప్పుకోజూస్తున్నాడన్నది స్పష్టమే.

"వాస్తవ పెట్టుబడి మదుపు తక్కువగా వుండటం, ఎగుమతుల పరిమాణం అతితక్కువగా వుండడం, స్థూల దేశీయ ఉత్పత్తి(జిడిపి) వృద్ధిరేటు అధికంగా వుండి రుణవితరణ తక్కువగా వుండటం అన్న పరిస్థితి కనీవినీ ఎరుగనది. దీని నిర్వహణ కష్టంగా వుంద"ని ఆర్థిక సర్వే పేర్కొంది. ఇంతటి నిరాశావహ స్థితి యువతకు స్వయం ఉపాధి అవకాశాల నివ్వలేదు. 'ముద్రా' రుణాల ఉద్యోగకల్పన కొండంతని మోడీ పొగిడాడు. కానీ ఆ పథకం క్రింద జరిగిన తక్కువ రుణవితరణ, అత్యధిక ఉద్యోగాలను కల్పించలేదు. ఏ ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశమూ అందుబాటులో లేని వారికి ఉపశమనంగా రూపొందించిన పథకం గ్రామీణ ఉపాధిహామీ పథకమని తెలిసి కూడా మోడీ దాని లబ్ధిదారుల సంఖ్యను ఉపాధి కల్పనగా చూపించాడు.

నోట్ల రద్దు అనియతరంగాన్ని నష్టపరచినట్లు ఆర్థికసర్వే చూపింది. నిజమే, ద్రవ్యోల్బణం తగ్గింది. కానీ దానికి మూల్యాన్ని రైతాంగమూ, అనియత రంగమూ చెల్లించాయి. నోట్లరద్దు తన లక్ష్యాలను సాధించలేకపోయిందని రిజర్వుబ్యాంకు వార్షిక నివేదిక 2016-17 తెలిపింది. రద్దయిన వెయ్యి, ఐదువందల నోట్లలో 98.96 శాతం తిరిగి బ్యాంకుల్లో జమయ్యాయి. సహకార బ్యాంకుల్లోనూ, నేపాలు లోనూ జమైన నోట్లను ఇంకా లెక్కించాల్సే వుంది. అయినా జమ కాకుండా పోయిన నోట్లవిలువ రూ.16000 కోట్లు మాత్రమే. దీనర్థమేమిటి? నల్లధనికుల సంఖ్య తక్కువగా వుండాలి లేదా నల్లధనాన్ని బ్యాంకు ఖాతాలలోకి చేర్చగల పద్ధతులను వారు కనుగొనివుండాలి.

పెద్దనోట్ల రద్దు "భారత ప్రజలకూ ఆర్థికానికీ మంచి లబ్ధిచేకూర్చింద"న్న మాటలకు భిన్నంగా, ప్రజలను ఊహించలేని కష్టాలకు గురిచేసింది. అనియతరంగాన్ని కుదేలుచేసింది.ఆర్థిక కార్యకలాపాలు నెలలపాటు ఆగిపోయాయి. జిడిపి వృద్ధిరేటు తగ్గుదల "పెద్దనోట్ల రద్దుకు ముందే మొదలైనా, రద్దు తర్వాత తీవ్రమైంద"ని ఆర్థికసర్వే పేర్కొంది. నోట్లరద్దు ప్రకటన సమయంలో చాలామంది చెప్పినట్లుగానే, ఆరునెలల తర్వాత కూడా కొత్తనోట్ల జారీ పూర్తికాలేదంటే, ద్రవ్య యిబ్బందుల్లో వున్న బ్యాంకులకు మాత్రమే నోట్లరద్దు లాభించింది. ఈ కోణంనుండి, నోట్లరద్దు పనికిరాని చర్య.

'ఒకే దేశం-ఒకే పన్ను' అని ఊదరగొట్టిన వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) అనియతరంగాన్ని నిశ్చేతనకు గురిచేసింది. వస్త్ర, తోళ్ళ, నిర్మాణరంగాలు బాగా దెబ్బతిన్నాయి. పన్నుల రంగాన్ని వ్యవస్థీకరించటం, పన్ను చెల్లింపులను మెరుగుపర్చడమన్న పేరిట చిన్న వ్యాపారులనూ, ఉపాధులను దెబ్బతీసింది. మనం వివరించినట్లుగానే, అనియత రంగాన్ని విదేశీ పెట్టుబడి మింగివేసేందుకు దారిపడింది; రాష్ట్రాల ఆర్థికం మరింత దిగజారింది.

నినాదాల హోరు ప్రక్కనపెడితే, యుపిఏ ప్రభుత్వ విధానాలనే బిజెపి ప్రభుత్వం కూడా మరింత వేగంగా, క్రూరంగా అమలుజరుపుతున్నది. సైనిక రంగంలో సహా, అన్ని రంగాలలోనూ విదేశీ పెట్టుబడికున్న ఆటంకాలను తొలగించింది. విద్య, వైద్యరంగాల ప్రైవేటీకరణను కొనసాగిస్తూ, దాని తార్కిక లక్ష్యమైన విదేశీ పెట్టుబడికి అప్పగించే దిశగా సాగుతున్నది. జాతీయ విద్యావిధాన రూప కల్పనలో సాచివేత చేస్తూ, దానిలో కొన్ని అంశాలను అమలుచేయటం, ఇటీవలి నూతన వైద్యవిధానం దీనినే తెలుపుతున్నాయి.

ప్రజలెదుర్కొంటున్న ఒక్క మౌలిక సమస్యను కూడా పరిష్కరించలేని బిజెపి ప్రభుత్వం, సమాజాన్ని మతపరంగా విభజించేందుకు అన్నిరకాలుగా పూనుకుంది. మాంసాహారంగానీ, మతాంతర వివాహాలుగానీ, మతాంతీకరణగానీ, చివరకు వేషధారణ అలవాట్లను కూడా గోరంతను కొండంత చేసి మతవిద్వేషాన్నీ, జాతీయోన్మాదాన్నీ రెచ్చగొట్టి, తర్వాత భౌతిక దాడులకు పూనుకుంటున్నది. విపక్షాన్నీ, విభేదించే వారినీ అణచివేసేందుకు మతోన్మాదం, జాతీయోన్మాదాలను వాడుతున్నది.

బెంగుళూరులో పత్రికారచయిత్రి గౌరీ లంకేశ్‌ను హత్యచేసిన వారు - అధికారం వున్న వారిని విమర్శించే, పై చేయిలోవున్న వైఖరులతో విభేదించే, సాంఘిక చెడుగులను వెలుగులోకి తెచ్చే, మానవ హక్కుల ఉల్లంఘనలను బయల్పరచే, ఉన్నత స్థాయిలో అవినీతినెదుర్కొనే హక్కు తమకుందని భావిస్తున్న పత్రికారచయితలందరికీ మీ గొంతు మూగపోతుందనే హెచ్చరికను జారీచేశారు. మతతత్వాన్నీ, కులవివక్షతను హిందూత్వవాదులు పెంచుతున్న తీరును వ్యతిరేకిస్తున్న మేధావులందరి గొంతునొక్కే పథకంలో భాగమే గౌరీ లంకేశ్ హత్య.

కొన్ని అరుదైన మినహాయింపులు తప్ప భారత మీడియారంగం లొంగే వుంటున్నది. బడా బూర్జువాల యాజమాన్యంలో మీడియా వుండటంతో, వారంగీకరిస్తేతప్ప, జర్నలిస్టులు అధికారంలోవున్న వారి చర్యలను బయటపెట్టలేరు. కనుకనే ఆర్థికం నుండి, విదేశీ వ్యవహారాలూ, టెర్రరిస్టులవరకూ ప్రభుత్వమిచ్చిన సమాచారాన్నే వల్లెవేస్తుంటాయి. విభేదించే గొంతు వినిపించటం చాలా అరుదు. గౌరీ లంకేశ్ హత్య జర్నలిస్టులకు మేలుకొలుపు కావాలి. ఇక్కడ జర్నలిస్టుల, మేధావుల ప్రాణాలు ప్రమాదంలో వుండటమొక్కటేకాదు; స్వేచ్ఛాయుత జర్నలిజం, ప్రజాస్వామిక విలువలను భవితవ్యం కోల్పోయే ప్రమాదమేర్పడింది. పెరుగుతున్న ఫాసిస్టు ధోరణులకిది సూచిక.

కొనసాగుతున్న ఆర్థిక సంక్షోభ ప్రభావం రాజకీయరంగంలో పడింది. రాష్ట్రాల అధికారాలు కూడా కేంద్రప్రభుత్వ చేతులలోకి చేరటం రోజు వారీగా జరుగుతున్నది. సహకార సమాఖ్యపేరిట రాష్ట్రాల ఆర్థికాన్ని కుదించే చర్యలను కేంద్రం తీసు కుంటున్నది. ప్రణాళికసంఘం స్థానంలో నితి ఆయోగ్ ఏర్పాటు ఇలాంటి వాటిలో ఒకటి. జిఎస్‌టి తమ ఆర్థికాన్ని దెబ్బతీసిందని బిజెపి రాష్ట్రప్రభుత్వాలే నసగటం మొదలైంది. వ్యవసాయం రాష్ట్రాల పరిధిలోది కాగా రాష్ట్ర చట్టాలను రద్దుచేసి ఒక వ్యవసాయ మార్కెట్టు చట్టాన్ని తెచ్చే ప్రయత్నాలు ప్రారంభించింది. దేశమంతా ఒకే వ్యవసాయ మార్కెట్టు ఏర్పరచమన్న డబ్ల్యుటిఒ, వ్యవసాయ బడాకంపెనీల ఆజ్ఞల అమలుకు పూనుకుంది.

రామజన్మభూమి, లవ్‌జీహాద్, ఘర్‌వాపసీ నినాదాలతో గద్దెనెక్కిన బిజెపి, ఇప్పుడు గోరక్షణ అనే మరో నినాదాన్ని తీసుకుంది. ఈ నినాదాలతో పాటుగా, ఇతర రాజకీయ పక్షాలకు భిన్నమైన కులసమీకరణతో ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో గెలిచింది.

నయాఉదారవాద విధానాలను అమలుజరప గల తన శక్తిని సామ్రాజ్యవాదులకు చూపెట్టు కునేందుకు మోదీప్రభుత్వం, ప్రతిపక్షాలు అధికారంలోవున్న రాష్ట్రప్రభుత్వాల చేతులు మెలిపెట్టి భయపెడుతున్నది. బీహార్ ఆర్‌జెడితో బంధాన్ని తెంచుకుని ఎన్‌డిఏలోకి నితిష్‌కుమార్‌ను తిరిగి తీసుకువచ్చిన తీరు దీనికుదాహరణ.

దిగజారుతున్న జీవనపరిస్థితులపై ప్రజల ఆగ్రహాన్ని రాష్ట్రప్రభుత్వాలపై ఒత్తిడి పెంచటానికి బిజెపి వాడుకుంటున్నది. ఢిల్లీలో నిర్భయ కేసులో లాగానే, జల్లికట్టుపై ప్రజల సమీకరణకు పూనుకుంది. తన ప్రయోజనాలకు భంగకరంగా ప్రజల్లో తమిళ జాతీయ భావాలు పెరగటంతో హఠాత్తుగా వెనక్కు తగ్గింది. జయలలిత మరణంతో ఏర్పడిన ఖాళీని అనుకూలంగా మలచుకునేందుకు, అవినీతిద్వారా ఏఐడియంకే సమీకరించుకున్న ద్రవ్య వనరులపై ఐటి దాడులు చేయించింది. ఆ పార్టీ లోని రెండువర్గాల చీలిక–కలయికలో బిజెపి పాత్ర అందరికీ కన్పించింది.

పశ్చిమబెంగాల్‌లో మతతత్వ ఎజెండాతో టిఎంసిని దెబ్బకొట్టడానికి బిజెపి వాడుకుంటున్నది. గూర్ఖాలాండ్ డిమాండుపట్ల ఎలాంటి అనుకూలత లేని బిజెపి, మమతాబెనర్జీని యిబ్బంది పెట్టేందుకు గూర్ఖాలాండ్ డిమాండును రెచ్చగొడుతున్నది. రెండు తెలుగు రాష్ట్రాల్లో అధికారంలోవున్న ప్రాంతీయ పార్టీలు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి పూర్తి మద్దతు తెలుపుతున్నప్పటికీ, వాటిని యిబ్బందుల్లో పెట్టే పనిని ప్రారంభించింది. టిడిపి, టిఆర్‌ఎస్‌ల మద్దతు సమీకరించుకోవటం ఒక ఎత్తుగడ మాత్రమేననీ, ఎంత మూల్యానికైనా అధికారంలోకి వచ్చేందుకు అనువుగా పనిచెయ్యమని హైద్రాబాదులో కార్యకర్తలకు అమిత్‌షా బోధించాడు. కూటమి ఏర్పాటుకు ప్రతిపక్షాల ప్రయత్నాన్ని వమ్ము చేసేందుకు ఎత్తుగడలన్నీ వినియోగిస్తున్నది.

2009 అమెరికా, భారత్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఏర్పరచిన నాటినుండీ, భారత బడా బూర్జువా వర్గం అమెరికా సామ్రాజ్యవాదం వైపు మొగ్గుచూపుతున్నది. దీని కొనసాగింపుగానే, 2016లో లాజిస్టిక్ మార్పిడి ఒప్పందంపై సంతకంచేసి, భారత రేవులను, సైనిక స్థావరాలనూ అమెరికా సైన్యం వినియోగించుకునేందుకు ఆమోదించింది. 2014లో అధికారంలోకి వచ్చినప్పటినుండీ మోడీప్రభుత్వం భారత వ్యూహాత్మక మిత్రుడు వాషింగ్‌టన్ అని పదేపదే ప్రకటిస్తున్నది. ఆసియాలోనూ, హిందూ మహాసముద్రంలోనూ అమెరికా ఆధిపత్య ప్రణాళికలో ముందుభాగాన బిజెపి, భారత్ నుంచింది. అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లతో త్రైపాక్షిక సైనిక సంబంధాలు పెట్టుకున్నది.

డోక్లామ్‌లో చైనాతో ఏర్పడిన ఎదురుబొదురు స్థితితో యిది స్పష్టమైంది. భూటాన్‌కు, చైనాకూ మధ్య వివాదాస్పదంగా వుండి, దాని పరిష్కారానికి వారిరువురూ చర్చలు సాగిస్తుండగా, ఎలాంటి చట్టబద్ధ హక్కులులేని ప్రాంతంలోకి భారత్ చొరబడింది. భారత్, భూటాన్‌ల మధ్య 2007లో జరిగిన ఒప్పందం ప్రకారం భారత్‌ను సంప్రదించ కుండా తన విదేశీ వ్యవహారాలను భూటాన్ స్వతంత్రంగా నిర్వహించుకోవచ్చును. అయినప్పటికీ, చైనా సైన్యం మన సరిహద్దులు దాటి వచ్చిందంటూ భారత్ తన సైన్యాన్ని సరిహద్దు ఆవలకు పంపింది. ఇది తప్పని రుజువుకాగానే, భూటాన్ కోరినందున ఈ చర్యతీసుకున్నానని సాకు చెప్పింది.

ఈ పరిస్థితిని మౌలిక సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకు బిజెపి జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టేందుకు వాడుతున్నది. హిమాలయాలకు రెండువైపులనుండి వస్తున్న వేడివేడి ప్రకటనలు భారత చైనాలమధ్య వెంటనే ఘర్షణకు దారితీయవు. కానీ భారత్ పూర్తిగా అనవసరమైన దుందుడుకు తనాన్ని చూపటం, దానిని అమెరికా సామ్రాజ్యవాదుల భల్లూకపు పట్టులోకి నెడుతుంది. పొరుగుదేశాలతో వున్న వివాదాలను చర్చలద్వారా సామరస్యంగా పరిష్కరించుకోవాలని, నేపాలు, భూటానుల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోరాదని ప్రభుత్వాన్ని డిమాండు చేయాలి.

మతోన్మాదాన్నీ, జాతీయోన్మాదాన్నీ వాడుకుని ప్రజలను చీల్చడంలో భారత పాలకవర్గాల, వాటి సామ్రాజ్యవాద యజమానుల ఉద్దేశ్యాలను బహిర్గత పరచవలసిన అవసరముంది. గత రెండేళ్లుగా ఉన్నత విద్యాలయాల ఆవరణలు కల్లోలాన్ని చవి చూశాయి. జెఎన్‌యుగానీ, ఢిల్లీ యూనివర్సిటీగానీ, రాజస్థాన్ విశ్వవిద్యాలయంగానీ, హైద్రాబాదు, హర్యానా కేంద్రీయ విశ్వవిద్యాలయాలుగానీ అది రోహిత్ వేములగానీ, కన్హయకుమార్‌గానీ, రాజశ్రీ రణవత్‌గానీ, ఉమర్ ఖలీద్‌గానీ, నివేదితా మీననగానీ కావచ్చు. తన తరహా హిందూ జాతీయత అన్న దానినంగీకరించని వీరందరినీ జాతి వ్యతిరేకులుగా ముద్రవేసి భౌతిక దాడులకు ఆర్‌ఎస్‌ఎస్ దిగుతున్నది. ప్రజాస్వామికశక్తులతో కలిసి విద్యార్థులు తమకు సాధ్యమైన మేరకు దీనిని ప్రతిఘటించారు. అలాంటి ప్రతిఘటన అవసరమైనది. లేదంటే ఈ మతతత్వ రథచక్రాల కింద పడి ఉన్నత విశ్వవిద్యాలయాలలోనూ, బయట సమాజం లోనూ నెలకొనివున్న మతసామరస్యం, శాంతి నలిగి పిండైపోతాయి.

అయితే హాస్టలు వసతులు, భవనాలు, కళాశాలకున్న భూమి, పరిశోధనలకు నిధులువంటి తక్షణ సమస్యలేకాకుండా, పరిశ్రమలకోసం విద్యా బోధనాంశాల మార్పు, విద్యకు చెందిన అన్ని పార్శ్వాలను నిర్దేశించే విధంగా విదేశీ నిధులతో

విశ్వవిద్యాలయాలకు పీటముడి వేయటంవంటి ఉన్నత విద్యారంగ విధానాలను కూడా ప్రభుత్వం చర్చల్లోకి రాకుండా చేయగలిగింది. మతతత్వశక్తుల నెదుర్కోవటంలో విద్యార్థులు మునిగివుండగా, విద్యారంగంపైనా, విద్యార్థులపైనా దుష్ప్రభావాన్ని నెరిపే సంస్కరణల అమలును ముందుకు నెట్టింది. యుజిసి, ఏఐసిటిఇ, ఎంసిఐలను రద్దుచేసి వాటి స్థానంలో ఉన్నత విద్యాకమీషన్‌ను నియమించాలన్న ఒక్క ప్రతిపాదనతప్ప, తక్కినవన్నీ దాదాపుగా అమలయ్యాయి. దీనినే ద్రవ్యపెట్టుబడి కోరు కుంటున్నది. గతంలో ఈ విద్యాలయాల విద్యార్థులే, ఈ సంస్కరణలన్న వాటిని ప్రతిఘటించారు.

ఇదే విషయం యితర వర్గాలకూ, సెక్షన్లకు కూడా వర్తిస్తుంది. భారత వర్గాల పనుపున బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు మతోన్మాదాన్నీ, జాతీయోన్మాదాన్నీ రెచ్చగొట్టడంలోని లక్ష్యం ప్రజలను చీల్చి, తాము అమలు జరుపుతున్న ప్రజావ్యతిరేక విధానాలపై వారి ప్రతిఘటనను బలహీనపరచటమే. హిందూ మతోన్మాదశక్తుల దాడులకు వ్యతిరేకంగా పోరాడుతున్న శక్తులతో చేతులు కలిపి ముందుకు సాగటంతో పాటుగా, అదే సమయంలో మతోన్మాద శక్తులు ముందుకునెడుతున్న దాగివున్న అజెండాను ప్రజలముందు బహిరంగపరిచి, వారి ప్రతిఘటన దాడులపైవరకే పరిమితంకాకుండా మరింత విశాల సమస్యలపై కూడా సాగేటట్లు చేయటం కమ్యూనిస్టు విప్లవకారుల కర్తవ్యం. దీన్ని నిర్వర్తించటంద్వారా భారత పాలకవర్గాల, వారి రాజకీయ ప్రతినిధుల కుట్రపూరిత చర్యలపట్ల ప్రజాచైతన్యాన్ని రగుల్కొల్ప గలము.

నిర్బంధ చట్టాలూ, యంత్రాంగానికిగల కోరలను మోడీప్రభుత్వం మరింత పదును పెడు తున్నది. ఆ విధంగా ప్రజాస్వామిక హక్కులను కాలరాయజూస్తున్నది. ప్రతిదానినీ ఆధార్‌కార్డుకు ముడిపెట్టి పౌరులందరినీ నియంత్రించాలని చూస్తున్నది.

వామపక్షాలతో సహా పార్లమెంటరీ పార్టీలన్నీ ప్రపంచీకరణను తిరుగులేని వాస్తవంగా తీసుకుని, తాము అధికారంలోవున్న రాష్ట్రాల్లో అమలు జరుపుతున్న పరిస్థితుల్లో, ప్రజల, దేశ భవితవ్యం తీవ్రప్రమాదంలో వుంది. ఈ సవాలునెదుర్కొ నేందుకు కమ్యూనిస్టు విప్లవకారులు సిద్ధంకావాలి. తమ శ్రేణులను బలపరుచుకుని, నిర్మాణాలను పటిష్టపర్చుకుని, వర్గ, ప్రజాఉద్యమాలను ముందుకు నడపాలి. ప్రజాస్వామిక, దేశభక్తియుత శక్తులతో ఐక్యమై ఈ క్రింది డిమాండ్లతో సవాళ్ళను ఎదుర్కొనేందుకు సంసిద్ధం కావాలి.

1. భూసేకరణ చట్టాన్ని రద్దుచేయాలి!
2. గనులు, ఖనిజాల ఆర్డినెన్సును రద్దు చేయాలి!
3. భూసంస్కరణలు అమలుచేయాలి!
4. కార్మిక సంస్కరణలను ఆపివేయాలి!
5. విద్య, వైద్యం వంటి సంక్షేమ రంగాలకు నిధులు పెంచాలి!
6. మతతత్వాన్ని వ్యతిరేకించాలి!
7. విద్యాసాంస్కృతిక రంగాల మతపూరితాన్ని ఆపాలి!
8. జాతీయోన్మాదాన్ని వ్యతిరేకించాలి!
9. అణువిద్యుత్తు కర్మాగారాల నిర్మాణాన్ని ఆపాలి!
10. విదేశీ పెట్టుబడి వద్దు!

**సామ్రాజ్యవాద దురాక్రమణలను వ్యతిరేకించండి!**

**పోరాడుతున్న ప్రజలకూ, పీడిత దేశాలకు సంఘీభావం తెలపండి!**

**9-9-2017**

**కేంద్రకమిటి**
**సిపిఐ(ఎం-ఎల్)**